
సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం। 7 । ఏప్రిల్ । 2025



రామ మందిరం..సాహితీ సౌరభం

ఒంటిమిట్ట కోదండ రామయ్య సేవలో ఎందరో కవులు పునీతులయ్యారు. అమూల్య ఆధ్యాత్మిక రచనలను రామయ్యకు అంకితం చేశారు. -8లో



దొంగల్లుడు!

భర్త చనిపోయి బాధలో ఉన్న అత్తను ఓదార్చాల్సిందిపోయి ... ఇదే అదునుగా భావించి ఆ అల్లుడు ఆమె ఇంటికే కన్నం వేశాడు. -8లో

గరిష్టం/కనిష్టం
37.8/24.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 24.8 - 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు ఒంటిమిట్టలో మంత్రుల పర్యటన

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి రాష్ట్ర మంత్రులు సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ విషయాన్ని డివిజనల్ పీఆర్‌ఓ మస్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారితో పాటు టీటీడీ, జిల్లా అధికారులు కూడా విచ్చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వీరు సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

11న బీసీల సమరభేరి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: ఈనెల 11వ తేదిన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న బీసీల సమరభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బహుజనసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలోని తమ పార్టీ కార్యాలయంలో ఇందుకు సబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండుతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఎస్పీ అభిమా నులు, బీసీ సంఘాల ప్రతినిధులు కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు బాలచంద్ర, మహిళా అధ్యక్షురాలు బేబి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో కూడా అందజేయాలని సూచించారు.

డయల్ యువర్ కలెక్టర్

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో తెలియజేశారు. ప్రజలు 08562-244437 ల్యాండ్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవం.. ధ్వజారోహణం

- ఒంటిమిట్టలో ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శేషవాహనంపై రాములోరి విహారం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు తొలుత హోమం నిర్వహించారు. గరుడ పతాక ప్రదర్శన చేపట్టారు. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం గరుడ పట్టాన్ని ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభానికి నవకళ పంచామృతాభిషేకం చేసి సకల దేవతలు, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. విష్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, ధ్వజస్తంభ రక్షాబంధనం, ఆరాధన జరిపారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ కార్యక్రమాన్ని తిలకించిన భక్త కోటి పులకించింది. కంకణబట్టర్ రాజేష్ ఆధ్వర్యంలో వృషభలగ్నంలో ధ్వజారోహణం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా సతీసమేతంగా విచ్చేసిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఒంటిమిట్ట, సిద్దవటం, రాజంపేట నాయకులు ఉన్నారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఒంటిమిట్ట పురవీధుల్లో సీతారామలక్ష్మణులను శేషవాహనంపై ఊరేగించారు. వాహన సేవలో కేరళవాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



శేష వాహనంపై ఊరేగుతున్న రఘురాముడు


స్వామివారిని దర్శించుకున్న ఎస్పీ: వైఎస్సార్ జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ కుటుంబ సమేతంగా ధ్వజరోహణానికి హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకున్నారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి వాహనసేవలు: బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు వేణుగానాలంకారణలో దాశరథి దర్శనమివ్వనున్నారు. రాత్రి హంస వాహనంపై స్వామివారు విహరిస్తారు.

కల్యాణానికి తలంబ్రాల తయారీ ప్రారంభం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం ఏప్రిల్ 11న జరగనుంది. ఇందుకోసం ఆదివారం తలంబ్రాల తయారీ ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేసి తలంబ్రాలతోపాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 425 మంది శ్రీవారి సేవకులు లక్షకుపైగా తలంబ్రాల ప్యాకెట్ల తయారీలో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ ఈఓ ప్రశాంతి, పీఆర్‌ఓ (ఎఫ్ఏసీ) నీలిమ, ఆలయ సూపరిటెండెంట్ హనుమంతయ్య పాల్గొన్నారు.

కవి సమ్మేళనం: ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం బమ్మెరపోతన జయంతిని పురస్కరించుకొని కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి రఘునాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో వసుపులేటి శంకర్ శ్రీ భాగవతం ప్రాశస్త్యాన్ని వివరించారు. నారాయణ రెడ్డి, రుక్మిణి సందేశం పోతనామాత్యుల వారి రచన రమణీయకతను, ముకుందుని ముందర రుక్మిణీ రమణి అంతరంగాన్ని ఆవిష్కరించారు. చంద్రశేఖర్ భాగవతంలోని గజేంద్ర మోక్షం అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ గోపాలకృష్ణ శాస్త్రి కుచేలోపాఖ్యానం అనే అంశంపై మాట్లాడారు. శివారెడ్డి వేమన చరిత్రపైన కవిత్వాన్ని చెప్పారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు



గరుడ పతాకాన్ని ఎగురవేసిన అర్చకులు



ధ్వజారోహణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి దంపతులు



కోదండ రామయ్య సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎస్పీ అశోక్‌కుమార్



గ్రామోత్సవంలో అలరించిన కోలాటాలు



ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్న వలంటీర్లు

చర్లపల్లి-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాదులోని చర్లపల్లి-తిరుపతి (07017-07018) మధ్య ప్రత్యే రైలును ప్రవేశపెట్టినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు ఈనెల 6, 11, 13, 18, 20, 25, 27, మే 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30 తేదీల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి బయలుదేరుతుందన్నారు. అలాగే తిరుపతి నుంచి ఈనెల 7, 12, 14, 19, 21, 26, 28, మే 3, 5, 10, 12, 17, 19, 24, 26 31 తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. ఈ రైలు ప్రతి శుక్ర, ఆదివారాల్లో చర్లపల్లిలో రాత్రి 9.35 గంటలకు, తిరుపతిలో సోమ, శనివారాలలో సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరుతుందన్నారు.



ఈ రైలు మల్కాజ్‌గిరి, కాచిగూడ, హుందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలుసిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుందని తెలిపారు. ప్రయాణికులు ముందస్తుగా తమ టిక్కెట్లను ముందుగానే రిజర్వు చేసుకోవాలని సూచించారు.

పెద్దశేషుడిపై పట్టాభిరాముడు

కలికిరి(వాల్మీకిపురం): అన్నమయ్య జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాస్వామి సాలకట్ల బ్రహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాత్రి 8 గంటలకు సీతారామలక్ష్మణులు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం 10 గంటల నుంచి స్నపన తిరుమంజనం జరిపారు. సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి శ్రీసీతారామలక్ష్మణులు పెద్ద శేషవాహనంపై కొలువుతీరి తిరుమాడ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, సూపరిండెంట్ మునిబాల కుమార్, అర్చకులు కృష్ణప్రసాద్ బట్టర్, కృష్ణరాజ బట్టర్, ఆలయ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాములవారి సేవలో మాజీ ఎమ్మెల్యే చింతల

పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాల్లో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి పాల్గొన్నారు.



పెద్ద శేషవాహనంపై విహరిస్తున్న సీతారామలక్ష్మణులు

వెంటిలేటర్‌పై వైద్య సేవ

పేదలకు ఉచిత వైద్యం అందించే బృహత్తర పథకం 'ఎన్టీఆర్ వైద్య సేవ' (ఆరోగ్య శ్రీ) పథకం పతనం దిశగా సాగుతోంది. ఇప్పటికే ఈ సంస్థలో పని చేస్తున్న సిబ్బంది తమ ఉద్యోగ భద్రత కోసం ఆందోళన బాట పట్టారు. మూడు దఫాలుగా విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. తాజాగా ఆషా (ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోషియేషన్) రాష్ట్ర కమిటీ వైద్య సేవల నిలుపుదలకు నిర్ణయించడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. కూటమి పాలకుల్లో ఎలాంటి స్పందన కనిపించకపోవడంతో 'ఎన్టీఆర్ వైద్య సేవ'పథకంపై 'పచ్చ'నీడలు కమ్ముకున్నాయి.

- రూ.కోట్లల్లో పేరుకు పోయిన బకాయిలు
- స్పందించని కూటమి పాలకులు
- నేటి నుంచి ఉచిత వైద్య సేవలు నిలుపుదల
- 'ఆషా'రాష్ట్ర కమిటీ నిర్ణయం
- పేదల ఉచిత వైద్యంపై పెను ప్రభావం

కడప రూరల్: 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం వెంటిలేటర్‌పై ఉంది. ఈ పథకంలో భాగంగా కార్పొరేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు లభించడమే ప్రధాన ఉద్దేశ్యం.ప్రభుత్వం ఈ నెట్ వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పెండింగ్ బిల్లులు రూ. కోట్లల పేరుకు పోయాయి. దీంతో ఆసుపత్రుల యాజమాన్యాలు 'బకాయిలు చెల్లిస్తే గాని తాము కోలుకోలేము..పేదలకు ఉచిత వైద్యంను అందించలేము'అని స్పష్టం చేశాయి.

పేరుకు పోయిన బకాయిలు..

'ఎన్టీఆర్ వైద్య సేవ'పరిధిలో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నెట్ వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. అందులో ప్రైవేట్ కార్పొరేట్ (నెట్‌వర్క్) ఆసుపత్రులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు కూడా ఉన్నాయి.



'వైద్య సేవ'కింద ఉచితంగా సర్జరీ చేస్తున్న వైద్యులు (ఫైల్)

- ప్రైవేట్ ఆసుపత్రులు వంద పడకలు, 50 పడకలు గల ఆసుపత్రులు ఉన్నాయి. ఒక రోజుకు వేలాది మంది నిరుపేద రోగులు ఉచిత వైద్యం కోసం నెట్ వర్క్ ఆసుపత్రులకు వస్తుంటారు. వారికి వైద్య సేవలు అందించాలంటే ఆసుపత్రుల యాజమాన్యానికి ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ ఆసుపత్రులకు ప్రభుత్వం కోట్లల్లో బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక నెలకే ఒక ఆసుపత్రికి రూ.లక్షల్లో ఖర్చు ఉంటుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బకాయిలను సక్రమంగా చెల్లించలేదు. విడుదల చేసిన నిధుల కన్నా..ఆసుపత్రుల్లో అందించిన వైద్య సేవలు, అందాల్సిన బిల్లులు అధికంగా ఉన్నాయి. దీంతో నెట్ వర్క్ ఆసుపత్రుల వారు అవకాశం ఉన్న బ్యాంకుల నుంచి ఓవర్ డ్రాఫ్టులు, ప్రైవేట్ సంస్థల నుంచి వడ్డీలకు అప్పులు తెచ్చి ఆసుపత్రులను నిర్వహిస్తున్నట్లు 'ఆషా'ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వ రంగానికి చెందిన ఆసుపత్రుల్లో 'వైద్య సేవ'పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ డెలివరీలు, పెద్దాసుపత్రుల్లో సాధారణ డెలివరీలతో పాటు సర్జరీలు, అలాగే గర్భాశయం తదితర వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య సేవలు అందిస్తారు. ఇందుకు గాను ఒక్కో వ్యాధిని బట్టి వైద్య సేవ ట్రస్ట్ నుంచి బిల్లులు మంజూరవుతాయి. ఆ విధంగా వచ్చిన డబ్బును ప్రోత్సాహకం కింద వైద్యులకు 45 శాతం, ఆసుపత్రుల అభివృద్ధికి 55 శాతం కేటాయిస్తారు. అధిక సంఖ్యలో ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల ద్వారానే దాదాపుగా 95 రకాల పైగా వ్యాధులకు ఉచిత వైద్య సేవలు లభించడంతో, ఈ ఆసుపత్రులపైనే పెనుభారం పడనుంది.

» పేదలను పట్టించుకోని ప్రభుత్వం

'వైద్య సేవ'లో పనిచేస్తున్న వైద్య మిత్రలు ఇతర సిబ్బంది తమ ఉద్యోగ భద్రత, సంస్థ మనుగడపై ఆందోళన చేపట్టారు. విడతల వారీగా విధులను బహిష్కరించి, శాంతియుత నిరసన తెలిపారు. నామమాత్రంగా చేపట్టిన విధుల బహిష్కరణకే ఉచిత వైద్యం కోసం వచ్చిన పేదలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఏకంగా నెట్ వర్క్ ఆసుపత్రుల వారే పూర్తిగా వైద్య సేవల నిలుపుదలకు గట్టిగా నిర్ణయించారు. ఇంత జరుగుతున్నా పాలకులకు చీమ కుట్టినట్లైనా లేదు. వైద్య సేవలు నిలిచిపోతే అనారోగ్యం పాలైన రోగులకు ఉచిత వైద్యం అందక, వారి పరిస్థితి ఎంత దయనీయంగా మారుతుందో ఊహించుకోవడమే కష్టం.

» 'ఆరోగ్య శ్రీ'పై అక్కసు...

2007-2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యంను అందించాలనే సంకల్పంతో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. తద్వారా లక్షలాది మంది పేదలు ఉచిత వైద్యం ద్వారా పునర్జన్మను పొందారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత బలోపేతం చేసింది. కాగా టీడీపీ ప్రభుత్వం ఎప్పుడొచ్చినా 'ఆరోగ్య శ్రీ'పథకం ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. దీంతో 'ఆరోగ్య శ్రీ'అంటే టీడీపీకి అక్కసు అనే అభిప్రాయం నెలకొంది. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం ఆసుపత్రులకు సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో వైద్య సేవలు నిలిపే పరిస్థితులు వచ్చాయి. దీంతో 'ఎన్టీఆర్ వైద్య సేవ'వెంటిలేటర్‌పై ఉందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ప్రమాదకర పరిస్థితులు ఉంటాయి



సకాలంలో వైద్యం అందితేనే కోలు కోవడానికి చాలా టైమ్ పడుతుంది. అలాంటిది ఉచిత వైద్య సేవలు నిలిచిపోతే అనర్థాలు జరిగిపోతాయి. అనారోగ్యం పాలైతే లక్షలాది రూపాయలు చెల్లించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపించుకోలేం. ప్రభుత్వం మా లాంటి పేదలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

-గంగాధర్‌రెడ్డి, అక్కాయపల్లె, కడప

మాకు సహకరించాలి



నెట్ వర్క్ ఆసుపత్రుల వారికి కోట్లల్లో బిల్లులు అందాలి. ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తేనే ఆసుపత్రులను నిర్వహించే పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 7 నుంచి ఉచిత వైద్య సేవలను నిలుపుదల చేస్తున్నాం.

- డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు, ఏపీ స్పెషాలిటీ హస్పిటల్ అసోషియేషన్

ప్రజాస్వామ్యం అపహాస్యం

- తప్పు చేసిన వారిని సస్పెండ్ చేయాలి
- నేడు ఎస్పీని కలుస్తాం
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



గోపవర ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా టీడీపీ నేతలు చేసిన దాడి వీడియోను చూపుతున్న రాచమల్లు

ప్రొద్దుటూరు: స్వయంగా పోలీసుల సమక్షంలోనే ప్రజాస్వామ్యం అపహాస్యం అయిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి మండిపడ్డారు. ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వారంలో గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా పోలీసులు, టీడీపీ నేతలు అనుసరించిన వైఖరిని తూర్పారబట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్యాన్ని బట్టలు ఊడదీసి నడిబజారులో నిలబెట్టారని విమర్శించారు. వాస్తవానికి టీడీపీకి ఒకే వార్డు మెంబర్ ఉన్నారని, పార్టీ మారిన వారితో కలిపి ఆరుగురు అయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీకి సంబంధించి 14 మంది వార్డు మెంబర్లు ఉంటే టీడీపీ ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. అధికార పార్టీ నేతలు దౌర్జన్యంగా బెదిరించి వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లను ఓటింగ్‌కు రాకుండా రాళ్లతో దాడి చేశారన్నారు. వాస్తవానికి వార్డు మెంబర్లు మాత్రమే పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లాల్సి ఉండగా 30 మంది టీడీపీ నాయకులు చేపల మార్కెట్‌కు వెళ్లినట్లు వస్తున్నా పక్కన ఉన్న పోలీసులు ప్రశ్నించకుండా మిన్నకుండిపోయారని తీవ్ర విమర్శలు చేశారు. తమ వార్డు సభ్యులు ఓటింగ్‌కు వెళుతుండగా రాళ్లతో దాడి చేయడంతో ప్రాణభయంతో బయటపడ్డారన్నారు. ఇన్ని జరుగుతున్నా పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర వహించారన్నారు. నిస్సిగ్గుగా టీడీపీ నేతలు వ్యవహరించిన కారణంగానే చివరికి ఎన్నిక వాయిదా పడిందన్నారు. ఫేక్ ఐడీ కార్డులతో దొంగ వార్డు సభ్యులను లోనికి పంపి ఎన్నిక జరిపించాలని టీడీపీ నేతలు ఎన్నికల అధికారిని బూతులు తిట్టి చేయిచేసుకున్నారని ఆరోపించారు. బచ్చల పుల్లయ్య, బచ్చల ప్రతాప్, సెల్‌పాయింట్ నవీన్, చీమల రాజశేఖరరెడ్డి, పర్లపాడు మహేశ్వరరెడ్డి లాంటి వారంతా లోనికి ఎలా వెళ్లగలిగారని ప్రశ్నించారు. స్వయంగా తమ ఉప సర్పంచ్ అభ్యర్థిని కొట్టుకుంటూ ఈడ్చుకెళుతున్నా పోలీసులు నిలువరించలేకపోయారని తెలిపారు. డీఎస్పీతోపాటు పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతోపాటు అక్కడే ఉండగా ఈ దౌర్జన్యకాండ జరిగిందన్నారు. టీడీపీ నేతలు విచ్చలవిడిగా అరాచకానికి, దౌర్జన్యానికి పాల్పడినా కనీసం ప్రశ్నించలేకపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ నాయకులు అడ్డు అదుపు లేకుండా పెట్రేగిపోతున్నారని విమర్శించారు.

- సమావేశంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ మోషా, ఉపసర్పంచ్ అభ్యర్థి రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

▶▶ అందరినీ గుర్తు పెట్టుకుంటాం

ఏడాదికో.. రెండేళ్లకో ఎన్నికలు వస్తే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరిని గుర్తు పెట్టుకుని విందు భోజనం ఏర్పాటు చేస్తానన్నారు. కేవలం తమను బదిలీ చేస్తారని పోలీసులు అనుకుటున్నారన్నారు. కేసులు పునర్విచారణ జరిపి అన్యాయానికి పాల్పడిన పోలీసులకు కేసులో ముద్దాయిలుగా చేసి ఉద్యోగాలు లేకుండా చేస్తామని హెచ్చరించారు. చట్టం అందరికి సమానమేనని తెలిపారు. ఈ సంఘటనపై రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, సోమవారం ఎస్పీని కలిసి విన్నవిస్తామన్నారు. ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా టీడీపీ శ్రేణులు ఇంత దారుణానికి పాల్పడినా ఇంత వరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. మొత్తం ఉపసర్పంచ్ ఎన్నిక వ్యవహారమంతా పోలీసుల ప్రోత్సాహంతోనే జరిగిందనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు.

క్లుప్తంగా

ఘాట్‌రోడ్డులో లారీ బోల్తా

చింతకొమ్మదిన్నె : బ్రాయిలర్ కోళ్ల లోడుతో రాయచోటి నుంచి మార్కాపురం వెళుతున్న లారీ ఆదివారం తెల్లవారుజామున గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో అదుపుతప్పి రోడ్డు పక్కనే గల మట్టి దిబ్బలపై పడింది. దీంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. లారీలోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు. బ్రాయిలర్ కోళ్లు 30 నుంచి 40 వరకు మృతి చెందినట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న పోలీసు రక్షక్ వాహన సిబ్బంది వెంటనే స్పందించి క్రేన్ ద్వారా వాహనాన్ని మామూలు స్థితిలోకి రోడ్డుపైకి తెప్పించారు.

గాయపడిన వ్యక్తి మృతి

కొండాపురం : మండల పరిధిలోని పాత కొండాపురం గ్రామానికి చెందిన కల్లూరు రంగాంజినేయుల్‌రెడ్డి(42) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కానిస్టేబుల్ నాగేంద్ర తెలిపారు. శనివారం మండలంలోని లావనూరు గ్రామం వద్ద ఓ వేర్‌హౌస్ గోడౌన్‌లో కల్లూరు రంగాంజినేయుల్‌రెడ్డి శనగ బస్తాలు వేసే సమయంలో పై నుంచి జారి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్నోవా కారు డ్రైవర్ శ్రీకాంత్‌ను కిడ్నాప్ చేసి, ఇన్నోవా కారును దొంగిలించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బీడీ కాలనీకి చెందిన తాజుద్దీన్, రెండవ గాంధీ బొమ్మ సమీపంలో నివసిస్తున్న నూరుల్లా అనే ఇద్దరు నిందితులను సీఐ ఓబులేసు, సిబ్బందితో కలిసి ఆదివారం బైపాస్ రోడ్డులోని దేవుని కడప ఆర్చీ సమీపంలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. మార్చి 15న హైదరాబాద్ నుంచి కారును బాడుగకు తీసుకొచ్చి ఆపై డ్రైవర్ పై దాడి చేసి ఇన్నోవా కారు, బంగారు దోచుకెళ్లిన కేసులో ఒక నిందితుడిని మార్చి 25న అరెస్ట్ చేశారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అదే రోజున బంగారు ఆభరణం, ఇన్నోవా కారును సీజ్ చేశారు. ఇదే కేసులో పరారైన ప్రధాన నిందితులు ఇరువురిని తాజాగా అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించారు.

మహిళపై హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు

ఖాజీపేట : మహిళపై హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట మండలం పుల్లూరు పంచాయతీలోని పీడబ్ల్యూ బంగళా వద్ద భాగ్య అనే మహిళ నివాసం ఉంటోంది. ఆమెకు కడపకు చెందిన ఓబుల్‌రెడ్డి, అతని సోదరుడు సూర్యప్రతాప్‌రెడ్డిలతో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈ విషయమై ఆమె కడపలోని ఓబుల్‌రెడ్డి, అతని తమ్ముని‌కి చెందిన ఇంటికి తాళం వేసి వచ్చారు. దీంతో కడపకు చెందిన సయ్యద్ మహమ్మద్ గౌస్ (20), గోగుల వసంత్ (22), కొండల బల్లు (24), చిల్లతోటి ఆకాష్ కుమార్ (22), చిన్నది నాని రమేష్ (22), కడప గౌస్ నగర్‌కు చెందిన మరొక బాల నేరస్తుడితోపాటు మరి కొందరు గత నెల 31వ తేదీ రాత్రి భాగ్య ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో డ్రైవర్ శివకృష్ణ గాయపడ్డాడు. ఆదివారం కడప ఇర్కాన్ సర్కిల్ వద్ద ఆరుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు.

రామ మందిరం..సాహితీ సౌరభం

- కోదండపాణి సేవలో పునీతులైన కవులు
- భాగవతం రచించిన బమ్మెర పోతన
- వాసుదాసు వాల్మీకి రామాయణం అంకితం
- అపర భక్తుడు మాల ఓబన్న



ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామయ్య సేవలో ఎందరో కవులు పునీతులయ్యారు. అమూల్య ఆధ్యాత్మిక రచనలను రామయ్యకు అంకితం చేశారు. అయ్యలరాజు తిప్పయ్య క్రీ.శ. 1440లో జగదభిరాముడికి సాహితీ సేవ చేసి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఒంటిమిట్ట రఘువీర జానకీ నాయక మకుటంతో ఆయన వెలువరించిన శతకం లభ్యమైంది. తొలుత రాచరిక పాలనలో తన పాండిత్యాన్ని సాగించినప్పటికీ తరువాత పూర్తిగా దాశరథి సేవకు అంకితమయ్యారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రామయ్య సేవలో తరించిన కవులపై కథనం.

చమత్కార శైలి.. విభిన్నం

అయ్యలరాజు రామభద్రుడు ఒంటిమిట్టలో క్రీ.శ. 1550లో ఇక్కడ నివాసం ఉన్నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. రామాభ్యుదయం కావ్యం ఆయన కలం నుంచి జాలువారింది. శ్రీ కృష్ణదేవరాయల అల్లుడు రామరాయల మేనల్లుడు గొబ్బూరి నరసరాజుకు ఈ కావ్యాన్ని అంకితం చేశారు. రామాభ్యుదయం 8 ఆశ్వాసాల గ్రంథం. రామభద్రుని కవిత్వంలో చమత్కారం తొణికిసలాడుతుంది.

చరిత్రపుటలలెక్కని కవి నల్లకాలువ అయ్యప్ప..

చరిత్ర పుటలలెక్కని కవి నల్లకాలువ అయ్యప్ప.. వరకవి నల్లకాలువ అయ్యప్ప కోదండ పాణిని సేవించి వర కవి అయ్యారు. చంద్రగిరిని పాలించిన రెండో వెంకటపతి రాయల బావమరిది కుమారుడు ఓబరాజు. ఈయన సర్వసైన్యాధ్యక్షుడిగా సేవలందించారు. ఆయనను ప్రసన్నం చేసుకుని అయ్యప్ప కృతులు చెప్పారు. నెల్లూరు జిల్లా భీమవరం గ్రామాన్ని అగ్రహారంగా పొందారు. పూర్వం నెల్లూరు నుంచి తిరుపతి వరకు దాడులు జరిగాయి. బద్వేలు, నందలూరు, రాజంపేట, కోడూరు, మామండూరు ప్రాంతాల మీదుగా దాడులు చేశారు. ఈ ఘటనలన్నింటిని నిర్భయంగా శతక రూపంలో అద్భుతమైన పద్యాలతో ఆవిష్కరించారు. ఆ శతకమే 'శత్రుసంహార వెంకటాచల విహార'

సాహితీ మణి మకుటం

మట్లిరాజులు సిద్దవటం కేంద్రంగా పరిపాలన చేశారు. వీరు రామయ్య క్షేత్రాన్ని వైభవోపేతంగా తీర్చిదిద్దారు. గుడి నిర్మాణ సమయంలో ఉప్పు గొండూరు వెంకట కవి తరచూ సందర్శన నిమిత్తం ఇక్కడకి వచ్చేవారు. ఆ సమయంలోనే ఏకశిలా నగరి రామయ్య మీద దశరథరామ అనే మకుటంతో శతకం రాశారు.

రామయ్యను దర్శించిన అన్నమయ్య

కోదండ రామస్వామిని పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య దర్శించి తన్మయం పొందారు. రాముడిపై అద్భుతమైన కీర్తనలను గానం చేశారు. నేటికి ఈ ప్రాంత ప్రజలకు ఆ కీర్తనలు సుపరిచితం.

• ఆయనది సడలని భక్తి భావం



రామాలయం తూర్పు దిశలో మాలకాటిపల్లె గ్రామం ఉంది. ఈ ఊరికి చెందిన భవనాసి మాల ఓబన్న జీవిత లక్ష్యం శ్రీరామచంద్రునిపై సడలని భక్తి భావం. ఆయన అమృత కంఠంతో నిరుపమాన రామకీర్తనలు పాడారు. పగటి పూట పనులు చేసుకుని రాత్రి పూట గుడికి ఎదురుగా ఉన్న సోపానాల ముందు కూర్చుని భజన పాటలు గానం చేసేవారు. బాగా పొద్దుపోయిన తరువాత ఇంటికి వెళ్లేవారు. ఒక రోజు సాయంత్రం రామయ్య దర్శనం కోసం తహసీల్దార్ వచ్చారు. ఆయన రావడాన్ని ఓబన్న గమనించలేదు. ఆధ్యాత్మికంగా అనురక్తితో లీనమై గానామృతం చేస్తూనే ఉన్నారు. దారికి అడ్డు తొలగలేదని తహసీల్దార్ ఆయనను దూషించారు. అదే రాజు రాత్రి తహసీల్దార్‌కు కలలో రాముడు కనిపించి భక్తుడిపై దూకుడు ప్రదర్శన మంచిది కాదని హితబోధ చేశారట. ఆ మరుసటి రోజు అధికారి ఓబన్న చెంతకు వచ్చి పొరపాటు జరిగిందని చింతించారు. భవనాసి పట్టుదల, భక్తి భావాన్ని చూసి మెచ్చుకున్నారు. నేటి పాలకులు మాల ఓబన్న సేవలను గుర్తించలేదు. ఆయనకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని భక్తుల ఆవేదన.

• రాముడికే అంకితం చేశారు. వావిలి కొలను సుబ్బారావు



వావిలి కొలను సుబ్బారావు(వాసుదాసు) తన యావదాస్తిని రాముడికి అంకితం చేశారు. వాల్మీకి మహర్షి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. కుమారాభ్యుదయం, కౌసల్యా పరిణయం రాశారు. 1908 అక్టోబర్ 9, 10, 11 తేదీలలో రామాయణం గ్రంథాన్ని రాముడికి అంకితం ఇచ్చారు.

• అక్షర హాలికుడు పోతన



వ్యాస మహర్షి సంస్కృతంలో రచించిన భాగవతాన్ని బమ్మెర పోతన తెలుగులో రాశారు. మహావిష్ణువును శ్రీరాముడిగా ఆదరించి తరించిన అపర భక్తుడు. భాగవతం రచన చేసి జగదభిరాముడి చరణానికి అంకితం చేశారు. ఇక్కడి నేల తల్లితో మమేకమై అక్షర సేద్యం చేసి హాలికుడిగా ఆయన ప్రత్యేకతను చాటారు. అమూల్య సాహితీ గ్రంథాలను తనకు అంకితమివ్వమని రాజులు అడిగితే అందుకు ఆయన అంగీకరించ లేదు.

శ్రీరాముడి జీవితం ఆదర్శం

– డీఈఓ డాక్టర్ షంషుద్దీన్



వడపప్పు, పానకాన్ని స్వీకరిస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్కరూ శ్రీ రాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, సన్మార్గంలో నడవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్. షంషుద్దీన్ సూచించారు. కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పదవ తరగతి ప్రశ్నా పత్రాలను మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులకు ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ రామయ్య చిట్స్ వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పానకం, వడపప్పు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులంతా ఈర్ష్య, అసూయ, ద్వేషాలను విడనాడి ఒకరికొకరు సహకరించుకుంటూ ఆనందంగా జీవించాలన్నారు. పానకం, వడపప్పు పంపిణీకి ఆర్థిక సహకారం అందించిన శ్రీ రామయ్య చిట్స్ నిర్వాహకులు కళావతి, రమేష్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి, కడప ఎంఈఓ గంగిరెడ్డి, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ బాదుల్లా, ఆపస్ నాయకులు పోగుల వెంకట్రామిరెడ్డి, సుబ్బరాయుడు, దేవిరెడ్డి కొండారెడ్డి, మిట్టా కేశవరెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, ఎస్‌ఎల్‌టీఏ నాయకులు అంకాల్ కొండయ్య, గిరిబాబు, వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలు!

- వైఎస్సార్‌సీపీ నేత అహ్మద్ బాషా అరెస్టుతో గోకుల్ సర్కిల్‌లో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్న టీడీపీ శ్రేణులు
- ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసు యంత్రాంగం



స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ శ్రేణులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్‌సీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తమ్ముడు ఎస్.బి అహ్మద్‌బాషాను ఆదివారం తెల్లవారుజామున కడప పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు, వర్గీయులు ఆదివారం రాత్రి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. 2022లో కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దాడి కేసులో ఫిర్యాదుదారుడైన ముస్తాక్ అహ్మద్‌ను, ఇతర అనుచరులను తీసుకుని వచ్చిన కొందరు టీడీపీ కార్యకర్తలు మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి అంజాద్‌బాషా ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న గోకుల్ సర్కిల్ వద్దకు వచ్చి పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. గతంలో ఎవరినైనా అరెస్ట్ చేస్తే ఇలాంటి సంబరాలు చేసుకున్నారా? అని ముక్కున వేలేసుకుని చూస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదనీ, కేవలం కూటమి నేతల కక్షసాధింపు, కవ్వింపు చర్యలు ఎలాంటి వాతావరణానికి దారితీస్తాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ శ్రేణుల సంబరాలను గమనించిన పోలీసులు నిశ్చేష్టులై, ప్రేక్షకపాత్ర పోషించడం గమనార్హం. గతంలో కడప నగర మేయర్ ఇంటి ముందు కావాలనే టీడీపీ నేతలు రెచ్చగొట్టి మహిళలు, ప్రజలచేత చెత్తవేయించడం, రెండు రోజుల క్రితం మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అనుచరుడు ఇబ్రహీం మియాపై దాడి చేయడమేగాక అతన్ని పరామర్శించేందుకు వచ్చిన కారణంగా ఏకంగా మహిళల చేత ప్లకార్డులను ప్రదర్శింపచేసి అంజాద్‌బాషా ఇంటిముందు ఆందోళన చేయించడం, తాజాగా ఆదివారం రాత్రి అహ్మద్‌బాషాను పోలీసులు అరెస్ట్ చేశారని బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకోవడం టీడీపీ నేతల కవ్వింపు చర్యలకు పరాకాష్టగా ప్రజలు భావిస్తున్నారు.

దొంగల్లుడు!

- అత్తారింటికే కన్నం వేశాడు
- 7 తులాల బంగారు ఆభరణాలు చోరీ
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : భర్త చనిపోయి బాధలో ఉన్న అత్తను ఓదార్చాల్సిందిపోయి ... ఇదే అదునుగా భావించి ఆ అల్లుడు ఆమె ఇంటికే కన్నం వేశాడు. రూ.6 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేసి చివరకు పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఆదివారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ వెల్లడించారు. గోపవరం మండలం టీ.సండ్రపల్లె గ్రామానికి చెందిన పిచ్చయ్య, పెంచలమ్మ దంపతులు గత కొన్నేళ్లుగా పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె భర్త అయిన మంగుదొడ్డి మురళి డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. వీరు గతంలో నెల్లూరు జిల్లా కలువాయి గ్రామంలో నివసిస్తూ రెండేళ్ల క్రితం నుంచి అత్తగారింటికి సమీపంలో వేరే ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. అయితే గత నెల 18వ తేదీన పిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులంతా స్వగ్రామమైన టీ.సండ్రపల్లెకు వెళ్లారు. వారితో పాటు మురళి కూడా వెళ్లాడు. అయితే ముందస్తు ప్రణాళిక ప్రకారం గత నెల 27న బద్వేలుకు వచ్చిన మురళి తెలుగుగంగ కాలనీలో ఉన్న అత్తగారింటికి వెళ్లి చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.6 లక్షలు విలువ చేసే 7 తులాల బంగారు ఆభరణాలు (ఒక లాంగ్‌చైన్, ఒక జత బంగారు గాజులు, ఒక జత బుట్టకమ్మలు, ఒక పాపిడిబిళ్ల) ఎత్తుకెళ్లాడు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా తిరిగి టీ.సండ్రపల్లెకు వెళ్లి కుటుంబ సభ్యులతో ఉన్నాడు. మరుసటిరోజు ఇంటి తాళాన్ని తెరిచి ఉండటం గమనించిన చుట్టుపక్కల వారు పెంచలమ్మ రెండవ కుమార్తె శిరీషకు విషయం తెలపడంతో ఆమె వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులకొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గ్రహించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చోరీ చేసింది అల్లుడు మురళినే అని గుర్తించి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తనతో పాటు ఎస్‌ఐలు రవికుమార్, సత్యనారాయణ, సిబ్బంది కలిసి నిందితుడు మురళిని పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన బంగారు నగలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో అర్బన్ ఎస్‌ఐలు రవికుమార్, సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు వెంకటేష్, ఓబులేసు, చెన్నారెడ్డి, నరసింహులు, కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోషన్ భయ్యా.. ఈ రోతేంటయ్యా!



- రాజకీయ అండతో రెచ్చి పోతున్న సీఐ రోషన్
- డబ్బుల కోసం ప్రజలను పీక్కు తింటున్న వైనం
- గతంలో ఉన్నతాధికారులు హెచ్చరించినా మారని తీరు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : అతను ఓ పోలీస్ అధికారి. అయితే వీధి రౌడీకి ఏ మాత్రం తక్కువ కాకుండా ప్రవర్తించడం ఆయన నైజం. పని చేసిన ప్రతి చోట వివాదాలు సృష్టించుకోవడం.. ప్రజలతో ఛీ కొట్టించుకోవడం ఆయనకు పరిపాటి. అయితే పుష్ప సినిమాలో లాగా తాను ఏమాత్రం తగ్గేదేలే అనే చందాన వ్యవహరిస్తున్నాడు. తన పద్ధతి, విధానాలను పోలీసుశాఖ లక్ష్యాలకు అనుగుణంగా మార్చుకోవడానికి ఏమాత్రం ప్రయత్నించకపోవడం ఆయన ప్రత్యేకత. తన సర్కిల్ పరిధిలోని ప్రజలకు రోత పుట్టించే విధంగా విధి నిర్వహణ ఉందంటే ఆయన తీరు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. నిష్పక్షపాతంగా విచారణ చేస్తే నిజానిజాలు బయటపడతాయని సర్కిల్ పరిధిలోని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేటి వరకు సీఐ రోషన్ వ్యవహార శైలిని గమనిస్తే కడప జిల్లాలో ఎక్కడో గాని ఇలాంటి అధికారి పోలీసుశాఖలో లేడనే చెబుతారు. డబ్బుల కోసం ఏ స్థాయికైనా దిగజారే మనస్తత్వం అని కమలాపురం ప్రాంతంలో ఏ ఒక్కరిని అడిగినా టక్కున చెప్పేస్తారు. ఇటీవల ఆయన విధి నిర్వహణలో అనేక భంగపాట్లు ఎదురైనా తనకు ఉన్నతాధికారుల అండ ఉందనే గర్వంతో పోలీసు స్టేషన్‌కు వచ్చే సామాన్య ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూనే ఉన్నాడు. ఇలా ఈయన గురించి చెప్పుకుంటూ పోతే రోషన్ రోత చరిత్ర అనే పెద్ద పుస్తకమే రాయాల్సి ఉంటుంది. ఇక ఇటీవల కమలాపురంలో జరిగిన కొన్ని సంఘటనలు గమనిస్తే.. కమలాపురం మండలం కోగటం గ్రామంలో ఒక చిన్న స్థాయి వీధి గలాటాకు సంబంధించి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన ఓ వ్యక్తిని నాలుగు రోజుల కిందట పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అధికార పార్టీ అగ్ర నాయకుడి ఆదేశాలతో ఆ వ్యక్తిపై పోలీసు జులుం ప్రదర్శించాడు. పోలీస్ స్టేషన్ నుంచి ఇంటికి పంపించాలంటే లక్ష రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. ఆ వ్యక్తి 45 వేల రూపాయలు చెల్లించడంతో ఆ డబ్బు తీసుకొని ఏమాత్రం సంతృప్తి చెందక మిగిలిన డబ్బుల కోసం ఆ వ్యక్తిపై వీధి రౌడీలా ప్రతాపాన్ని చూపాడు. సీఐ రోషన్ కొట్టిన దెబ్బలకు ఆ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో స్పృహ తప్పి పడిపోవడంతో కమలాపురానికి చెందిన ఒక వైద్యుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వైద్యం చేయించారు. బాధితుడి కుటుంబీకులు ఈ విషయంపై ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోం మంత్రి, డీజీపీ, డీఐజీ, ఎస్పీ, మానవ హక్కుల సంఘానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే కమలాపురం పట్టణంలో ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్ష లీకేజీ వ్యవహారంలో బాధ్యులు కాని వ్యక్తులపై కూడా అధికార పార్టీ అగ్ర నాయకుడు చెప్పాడనే ఏకైక కారణంతో స్వామి భక్తిని చాటుకునేందుకు.. దీనికితోడు వారి దగ్గర డబ్బును బాగా దండుకోవచ్చనే దురుద్దేశంతో సంబంధం లేని వ్యక్తులను సైతం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి.. కేసు నమోదు చేసి.. వారిని బెదిరించి.. వారి నుంచి భారీ స్థాయిలో డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేసిన విషయం కమలాపురంలో వీధి వీధినా వ్యాపించింది. డబ్బులు ఇవ్వని కొందరు నిందితులను భారీ స్థాయిలో పోలీస్ కోటింగ్ ఇచ్చిన ఘనత కూడా రోషన్‌కే దక్కింది. అలాగే చిన్నచెప్పలి గ్రామానికి చెందిన తండ్రి కొడుకుల ఆస్తి వ్యవహారంలో రోషన్ వ్యవహరించిన అత్యుత్సాహం సామాన్యుడిని సైతం నివ్వెర పరిచింది. జిల్లా ఉన్నతాధికారి ఈ విషయంలో జోక్యం చేసుకోవడంతో రోషన్ కొంచెం వెనక్కి తగ్గినట్టుగా కనిపించింది. ఈయన కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి నెలలోనే రాయచోటి ప్రాంతానికి సంబంధించిన ఒక వ్యక్తికి కమలాపురానికి సంబంధించిన ఒక మైనారిటీ వర్గ నాయకుడికి జరిగిన వ్యవహారంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న ఆ మైనార్టీ నాయకుడిని బెదిరించి దాదాపు 15 లక్షలకు పైగా వసూలు చేసుకున్న ఘనాపాటి ఈ సీఐ అని ప్రజలు చర్చించుకుంటున్నారు. డబ్బులు ఇచ్చిన వ్యక్తి స్వయంగా ఒక డివిజనల్ అధికారిని కలిసి ఫిర్యాదు చేసి వీడియో దృశ్యాలను చూపించినా ఆ డివిజనల్ అధికారి మిన్నకుండిపోవడం గమనిస్తే ఈ సీఐ ఏ స్థాయిలో అధికారులను తన వైపు తిప్పుకుంటున్నాడో తెలిసిపోతోంది. ఇక ఇటీవల కడప జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఈ జీ అశోక్ కుమార్ తమ నియోజకవర్గ నాయకుడికి అత్యంత ఆప్తుడని, అలాగే రేంజ్ పరిధిలో ఉన్న ఓ అధికారి సైతం తమ నాయకుడి మాటే వింటాడని తనను ఎవరూ ఏమీ పీకలేరని బహిరంగంగానే ఈ అధికారి మాట్లాడడం గమనిస్తున్న కమలాపురం ప్రజానీకం ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ సీఐ గారికి జీతం ఇచ్చేది నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ అగ్ర నాయకుడా?? లేక పోలీస్ శాఖనా అనే విషయంపై చర్చ కూడా కమలాపురం ప్రాంతంలో జోరుగా జరుగుతోంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కమలాపురం పట్టణంలో దాదాపు పదికి పైగా అధికార పార్టీ అగ్ర నాయకుడి బెల్ట్ షాపులు బహిరంగంగా బార్‌లను తలదన్నే విధంగా నడుస్తున్నాయంటే వాటి నుంచి ఈయన ఎంత దండుకుంటున్నాడో మరో మాట చెప్పాల్సిన అవసరమే లేదు. ఇంత బహిరంగంగా బెల్ట్ షాపులు ఈ సీఐ రోషన్ సహాయంతో నడుస్తున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్ శాఖ కూడా కళ్లకు గంతలు కట్టుకున్నట్లుగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో తగిన జోక్యం చేసుకొని రోషన్ ఆగడాలను అరికట్టకపోతే కమలాపురం పోలీసుల తీరు మరో బీహార్ ప్రాంతాన్ని తలపించే విధంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



సీఐ రోషన్ చితకబాదిన ఘటనలో ఒంటిపై ఉన్న గాయాలను చూపుతున్న బాధిత యువకుడు

కోగటం సంఘటనపై సీఐ రోషన్‌ను వివరణ కోరగా అదంతా బోగస్ అని కొట్టి పారేశారు. వారు లాయర్‌కు డబ్బు ఇచ్చుకున్నారేమో గాని తాను డబ్బు అడగలేదని వివరించారు.